అతివలకు తీపి కబురు!

- దీపావళి పండగ కానుకగా 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ
- నాలుగు నెలలకొకటి చొప్పున అందించనున్న ఎన్డీయే సర్కారు
- డబ్బులు చెల్లించిన 48 గంటల్లో మహిళల ఖాతాకు నగదు జమ

–న్యూస్‌టుడే, రాయచోటి



మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి స్వయం ఉపాధితో జీవించేవిధంగా సామూహిక రుణ సౌకర్యాలు కల్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కింది. మార్కెట్‌లో ధరలు పెరిగిపోయి వంట గ్యాస్ కొనలేక ఎంతోమంది పేదలు పొగ పొయ్యిలనే వినియోగిస్తున్నారు. అలాంటి వారికి అప్పట్లో దీపం పథకం తీసుకొచ్చి గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇచ్చారు. తాజాగా ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసేందుకు ముందుకొచ్చింది. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి మంత్రివర్గం ఆమోదం తెలపడంతో ఏడాదికి మూడు చొప్పున గ్యాస్ సిలిండర్లు పేద కుటుంబాలకు అందనున్నాయి. ఇందుకు సంబంధించిన విధి విధానాలు రూపొందించి అక్టోబరు 31 (దీపావళి) రోజున పథకాన్ని ప్రారంభించనుంది. జిల్లాలోని 5.16 లక్షల మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో గ్యాస్‌సిలిండరు ధర రూ.853 ఉంది. అందులో ప్రభుత్వ రాయితీ రూ.25 పోను 828 చొప్పున ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.2,484 లబ్ధి చేకూరనుంది.

దీపావళి రోజున పథకం ప్రారంభం

రాష్ట్రంలో ఉచిత సిలిండర్ల పంపిణీని ప్రభుత్వం దీపావళి పండగ రోజు అక్టోబరు 31న ప్రారంభించేవిధంగా మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. ఈ గడువు మరో ఎనిమిది రోజులే ఉండడంతో అర్హత గల వారి పేర్ల నమోదుకు ఈ నెల 24వ తేదీ నుంచే అవకాశం కల్పిస్తున్నారు. సిలిండరు తీసుకునే సమయంలో లబ్ధిదారులే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. సిలిండరు తీసుకున్న 48 గంటల్లోగా లబ్ధిదారుల ఖాతాలో తిరిగి నగదు జమ చేస్తారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు, ఇతరత్రా కారణాలతో నగదు జమకాకపోతే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సమస్య పరిష్కరించుకునేవిధంగా వెసులుబాటు కల్పిస్తున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

జిల్లాలో 34 గ్యాస్ ఏజెన్సీల ద్వారా 5,16,889 మంది లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్లు పొందారు. వీరిలో దీపం పథకం కింద 2,03,085 మంది ఉన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన కింద 12,929 మంది కనెక్షన్లు పొందారు. మిగిలిన 3,00,875 మంది సీఎస్ఆర్, జనరల్ కింద కనెక్షన్లు పొందినవారు ఉన్నారు. ఇప్పటికే ఈకేవైసీ చేయించే ప్రక్రియను ఏజెన్సీల నిర్వాహకులు వేగవంతం చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం కింద ప్రభుత్వం లబ్ధిదారునికి తిరిగి నగదు చెల్లింపులు అంతర్జాలం ద్వారానే చేయనుంది. దీంతో లబ్ధిదారుల వివరాలు ఈకేవైసీ ద్వారా ప్రభుత్వం గుర్తించే అవకాశం ఉంది. గ్యాస్ ఏజెన్సీల వద్దకు లబ్ధిదారులు ఆధార్‌కార్డు వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. ప్రక్రియ పూర్తయితే అర్హత గల గ్యాస్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయనే లెక్క తేలనుంది. నిరుపేదల ఆధారంగా తీసుకుంటే దీపం కనెక్షన్లకు మాత్రమే ఉచిత పథకం వర్తించే అవకాశం ఉండనుంది. ఈ నెల 24 నుంచే విధి విధానాలు వెల్లడించి ఉచిత కనెక్షన్లకు నమోదు ప్రక్రియ మొదలు కానుంది.

దీపం కనెక్షన్లపై రూ.148 కోట్లు ఆర్థిక భారం

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించడానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,700 కోట్లు ఆర్థిక భారం భరించాల్సి ఉంది. జిల్లాలో రేషన్‌కార్డుల ఆధారంగా ఇచ్చిన గ్యాస్ కనెక్షన్లు 5,16,889 ఉన్నాయి. 1999లో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు దీపం పథకాన్ని ప్రారంభించారు. పథకం కింద జిల్లాలో 2,03,085 కనెక్షన్లు ఉన్నాయి. వీరికి ఇప్పటికే సిలిండరుపై రూ.41 ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ఈ లెక్కన జిల్లాలో రూ.83.26 లక్షలు రాయితీ రూపంలో ఆర్థిక భారం పడుతోంది. దీపం లబ్ధిదారులకు ఏడాదికి మూడు సిలిండర్లు చొప్పున అందచేస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.148 కోట్లు ఆర్థిక భారం భరించాల్సి ఉంటుంది.

ఉజ్వల భారం ఏటా రూ.2.14 కోట్లు

ప్రధాన మంత్రి ఉజ్వల అవాజ్ యోజన కింద జిల్లాలో 12,929 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పథకం కింద ఒక్కో సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.300 చొప్పున ఏటా 12 సిలిండర్లకు రాయితీ 4.65 కోట్లు కేంద్రం భరిస్తోంది. పథకం కింద కేంద్ర రాయితీ రూ.300 పోను మిగిలిన రూ.553 ఆయిల్ కంపెనీలు, రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏడాదికి మూడు సిలిండర్లు పంపిణీ చేస్తే 12,929 కుటుంబాలకు సంబంధించి రూ.2.14 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఆనంద ప్రయాణం... అంతలోనే విషాదం!

- వివాహ రిసెప్షన్‌కు వెళ్తూ ముగ్గురి మృతి
- కారును ఢీకొట్టిన ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు
- ప్రమాదంలో మరో నలుగురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పెళ్లి జరిగి రెండు రోజులు గడిచింది. ఆనందం నిండిన ఆ ఇంట విషాదం ఆవహించింది. మేళతాళాలు మోగిన ముంగిట ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. కుమార్తె అత్తవారింట వేడుకకు సంతోషంగా మొదలైన ప్రయాణం అర్ధాంతరంగా ముగిసింది. రహదారి ప్రమాదం మూడు ప్రాణాలను చిదిమేసింది. రెండు కుటుంబాలను కన్నీటిపాల్జేసింది. మరణంలోనూ ఆ దంపతుల బంధం వీడలేదు. కలిసి జీవించిన వారు కలిసే కన్నుమూశారు. ఆనంద వేడుక విషాదంగా మారింది. రైల్వేకోడూరు సమీపంలోని బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు.

- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు గ్రామీణ, కర్నూలు నేరవార్తలు





వాసవి, ప్రేమ్‌కుమార్ దంపతులు, సుచిత్ర (పాత చిత్రాలు)

కర్నూలు నగరంలోని షరాఫ్ బజార్‌కు చెందిన బంగారం వ్యాపారి, ఉడ్‌లాండ్స్ లాడ్జి యజమాని కామిశెట్టి గురవయ్య ఇంట విషాదం నెలకొంది. ఆర్యవైశ్యులందరికీ సుపరిచితుడైన గురువయ్యకు ముగ్గురు కుమారులు రాజేష్, మహేష్, జగదీష్ ఉన్నారు. రాజేష్ కుమార్తె సిరిచందన (న్యాయవాది)కు తిరుపతికి చెందిన రోహిత్‌తో ఈ నెల 20న కర్నూలులో వివాహం జరిగింది. ఈ నెల 24వ తేదీన తిరుపతిలో రిసెప్షన్ నిర్వహించనున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి వాహనాల్లో బుధవారం కర్నూలు నుంచి తిరుపతికి బయల్దేరారు. రైల్వేకోడూరు వద్ద మైసూరివారిపల్లె సమీపంలో తిరుపతి నుంచి కడప వైపు ఎదురుగా వస్తున్న ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో నవవధువుకు పిన్ని వరస అయిన సుచిత్ర(49), వారి బంధువులు కళాక్షేత్ర సిల్క్‌హౌస్ యజమాని ప్రేమ్‌కుమార్ (55), ఆయన భార్య వాసవి(45) మృతిచెందారు. ప్రమాదంలో గాయపడిన మహేష్, లలితమ్మ, ఉపేంద్ర, రాజేశ్వరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హేమసుందరరావు తెలిపారు.

ఐదో అంతస్తు నుంచి కిందపడి విద్యార్థి మృతి

అర్ధరాత్రి కిటికీ నుంచి బయటకు వెళ్లే ప్రయత్నంలో ప్రమాదం



మాదాపూర్ (హైదరాబాద్), న్యూస్‌టుడే: అర్ధరాత్రి వసతిగృహం గది కిటికీ నుంచి బయటకు వెళ్లే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి కిందపడి ఇంటర్మీడియట్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్ నగరంలోని మాదాపూర్‌లోని నారాయణ కళాశాలలో ఘటన చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం వెంకటరెడ్డిపల్లెకు చెందిన కొలవల మహేశ్వర్‌రెడ్డి దంపతులు బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లారు. వీరి కుమారుడు **కె.శివకుమార్‌రెడ్డి** (18) మాదాపూర్‌లోని నారాయణ కళాశాలకు చెందిన బాసర్ క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతూ వసతిగృహంలో ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో శివకుమార్‌రెడ్డి తన ముగ్గురు స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాలనుకున్నాడు. ఐదో అంతస్తులో వారు ఉంటున్న గది కిటికీకి గ్రిల్స్ లేకపోవడంతో సదరు కిటికీ నుంచి పక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలోకి దిగి అక్కడి నుంచి బయటకు వెళ్లాలనుకున్నాడు. కిటికీ నుంచి పక్క భవనంలోకి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు శివకుమార్‌రెడ్డి కిందపడ్డాడు. వెంటనే ఇద్దరు స్నేహితులు అదే కిటికీ నుంచి కిందికి దిగి వెళ్లి చూడగా శివకుమార్‌రెడ్డి రక్తమడుగులో పడి ఉన్నాడు. వెంటనే విషయాన్ని వసతిగృహం, భద్రతా సిబ్బందికి తెలియజేయడంతో వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అర్ధరాత్రి నలుగురు విద్యార్థులు బయటకు ఎందుకు వెళ్లాలనుకున్నారనే విషయం తెలియరాలేదని ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. మరోవైపు కళాశాలలో సరైన భద్రతా చర్యలు లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండు చేశారు. కుమారుడి మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు కువైట్ నుంచి స్వదేశానికి బయల్దేరారు.

బిర్యానీ తినాలని నిర్ణయించుకుని...

విద్యార్థులు రాత్రి 10 గంటలకు నిద్రపోతారు. సిబ్బంది 11 గంటలకు నిద్రపోయిన అనంతరం శివకుమార్‌రెడ్డి, అతడి స్నేహితులు కలిసి బయటకు వెళ్లి బిర్యానీ తినాలని నిర్ణయించుకున్నారు. వసతిగృహం గది కిటికీ లోంచి కిందకు దిగాలనుకున్నారు. ముందుగా శివకుమార్‌రెడ్డి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారీ ఐదో అంతస్తు నుంచి కిందపడ్డాడు. గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించాం. వైద్యులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. **-ఉపేందర్‌రెడ్డి, ఏజీఎం, నారాయణ కళాశాల**

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా నవంబరులో 4, 11, 18, 25 తేదీల్లో (సోమవారాలు) శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ప్రాంతీయ అధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం, మహానంది, అరుణాచలం తదితర ప్రాంతాలకు బస్సులు వెళ్తాయన్నారు. అలానే నవంబరు 15న పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు నడుపుతామని చెప్పారు. కార్తిక మాసంలో అయ్యప్ప భక్తులకు కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లాలోని ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు.

సమస్యలపై నిలదీత!

- అజెండా పంపకుంటే ఎలాగని ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- వాడివేడిగా సాగిన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం



అజెండాపై అడిగిన ప్రశ్నకు బదులిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి, వేదికపై ఛైర్‌పర్సన్ శారద, ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, అన్నమయ్య డీఆర్వో సత్యనారాయణ

–న్యూస్‌టుడే, కడప ఏడురోడ్లు

మంత్రి, ఉన్నతాధికారులు లేకుండా సమావేశమెందుకు?, అజెండా పంపకుంటే అంశాలపై ఎలా చర్చించాలి?, ఎరువుల అధిక ధరలకు విక్రయం, జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంపై చర్యలేవీ?.... ఇలా పలు అంశాలపై జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు గళమెత్తారు. కడపలో బుధవారం జడ్పీ ఛైర్మన్ శారద అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇన్‌ఛార్జి కలెక్టరు ఆదితిసింగ్, అన్నమయ్య డీఆర్వో సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ బాలయ్య, డిప్యూటీ సీఈవో మైధిలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వాడివేడిగా చర్చ జరిగింది. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొనగా, వ్యాపారులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని, అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖాధికారి బదులిచ్చారు. ఉమ్మడి కడప జిల్లాలో కరవు మండలాలుగా ప్రకటించేందుకు ఎన్నింటికి ఆస్కారం ఉందని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనాల ధర కంటే బయట మార్కెట్లలో తక్కువగా ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ధరలు తగ్గించాలని కోరారు. వీఎన్‌పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ తమ మండలంలో ఉల్లి పంటలకు నష్టం జరిగిందని, రైతులను ఆదుకోవాలన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాంబపురంలో చేనేత కార్మికులు ఒక్కరూ కూడా లేకున్నప్పటికీ 50 మంది పింఛన్లు తీసుకుంటున్నారని, వీరిని జాబితా నుంచి తొలగించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి డిమాండు చేశారు. రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ సమస్యలపై అర్థవంతమైన చర్చ జరగాలన్నారు. ప్రతి సమావేశంలో తాము ప్రశ్నలను అడగడం, అధికారులు చేస్తామని చెప్పడంతోనే సరిపోతోందని, చర్యలపై నివేదిక ఇవ్వకపోతే ఎలాగని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జడ్పీ అధికారులను నిలదీశారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మైలవరం మండలంలో వరద ప్రవాహానికి అడ్డంగా సిమెంటు పరిశ్రమను నిర్మించారని, దీంతో పంటలు ముంపునకు గురవుతున్నాయని, దీనిపై కలెక్టరు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నమయ్య జలాశయం నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని రామాపురం జడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణ తీర్మానం ప్రతిపాదించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు శివప్రసాద్‌రెడ్డి, సుమిత్ర రాజశేఖర్‌రెడ్డి, ముత్యాల ప్రసాద్, వెంకటసుబ్బయ్య, రవికుమార్‌రెడ్డి, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ సెంటర్ ఏర్పాటుకు కృషి

ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తి నుంచి తరలించడం సరికాదని చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డి పేర్కొనగా, సంబంధిత అధికారి మాట్లాడుతూ తొలుత ఆ సెంటర్ గుంటూరు జిల్లాకు మంజూరైందన్నారు. అక్కడ స్థల సమస్యతో కడపలోని కొప్పర్తికి తీసుకొచ్చారని, సీఆర్‌డీఏ ఏర్పడిన తర్వాత స్థలం లభించడంతో అక్కడికి తరలించారని తెలిపారు. 2021లో గుంటూరు, కొప్పర్తిల్లో రెండు సెంటర్లు ఉండేవిధంగా ప్రతిపాదనలు చేయగా, కేంద్రం నుంచి ఒకదానికే ఆమోదం వచ్చిందని వెల్లడించారు. దీనిపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అందరం కలిసి ఈ సెంటర్‌ను కడపకు తీసుకొచ్చేవిధంగా ప్రయత్నిద్దామన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అజెండా ఇప్పుడు ఇస్తారా?

'జడ్పీ సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు చెప్పి, గంట ఆలస్యంగా ప్రారంభించారు. అజెండా కూడా పంపడం లేదు. తాను వచ్చాక ఇచ్చారు. ఇది సరైన పద్ధతేనా' అంటూ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమావేశం ప్రారంభంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి కలుగజేసుకుని అజెండా ఆలస్యంగా ఇస్తే తాము ఎలా సన్నద్ధం కావాలని ప్రశ్నించారు. అసలు మంత్రులు అందుబాటులో లేరు.. రెగ్యులర్ కలెక్టరు లేరు. జడ్పీ సీఈవో లేరు.. సమావేశాన్ని వాయిదా వేస్తే మేలని పేర్కొన్నారు. దీనిపై జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి స్పందిస్తూ గత సమావేశం నిర్వహించి 90 రోజులైన నేపథ్యంలో ప్రస్తుతం తప్పనిసరి అని చెప్పడంతో ప్రారంభించారు. ఇకపై అజెండాతో పాటు ప్రగతి నివేదిక పుస్తకాలను ముందుగానే పంపిస్తామని ఆమె హామీ ఇచ్చారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

వీసీని తొలగించేవరకు పోరాటం ఆగదు

వైవీయూను ముట్టడించిన విద్యార్థులు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: లైంగిక వేధింపులకు పాల్పడిన యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీ కె.కృష్ణారెడ్డి పదవి నుంచి దిగే పోయే వరకు తమ పోరాటం ఆగదని, వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘం నాయకులు గంగా సురేష్, వలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వారు వైవీయూ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కృష్ణారెడ్డిని వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు శివశంకర్, తేజ, చంద్ర పాల్గొన్నారు.



విద్యార్థులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఉపముఖ్యమంత్రి చొరవతో వరద బాధితులకు ఊరట

- తాగునీటి సమస్యకు పరిష్కారం
- వ్యవసాయ రుణమాఫీకి చర్యలు



రాజంపేట మండలం మందపల్లిలో పంటపొలాల్లో మేటలు వేసిన ఇసుకను తొలగిస్తున్న రైతులు (పాత చిత్రం)

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జలాశయం వరద బాధిత గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే అడుగులు పడుతున్నాయి. కొద్ది రోజుల కిందట వరద బాధితుల సమస్యలను స్వయంగా పరిశీలించడానికి రాజంపేట మండలం పులపుత్తూరుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అప్పట్లో ప్రజలకు చెప్పిన ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. పులపుత్తూరు గ్రామంలోని ఎస్టీ కాలనీ ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరించి రెండు రోజుల్లోనే గ్రామానికి తాగునీరందించేవిధంగా చర్యలు తీసుకున్నారు. మరోపక్క వరదలతో మందపల్లి, పులపుత్తూరు, శేషమాంబపురం, గుండ్లూరు, తొగురుపేట గ్రామ పంచాయతీల పరిధిలోని డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలను అప్పటి వైకాపా ప్రభుత్వం మాఫీ చేసింది. అదే విధంగా రైతుల రుణమాఫీ చేయాలని అప్పటి ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదని రైతులు ఫిర్యాదు చేయడంతో ఉపముఖ్యమంత్రి ఆదేశాలపై అధికారులు ఇంటింటికి తిరిగి నష్టపరిహారంపై వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు సీఎంవో కార్యాలయానికి చేరడంతో రుణమాఫీపై పూర్తి వివరాలతో నివేదికలు పంపాలని నాలుగు రోజుల కిందట సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలొచ్చాయని బాధిత రైతులు తెలిపారు. ఉపముఖ్యమంత్రి చొరవతో తమ సమస్యలు తీరుతున్నాయని బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ రుణమాఫీ జరిగితే దాదాపు 200 మంది రైతులకు మేలు జరుగుతుంది. దీనిపై ఏవో రాజకుమారి మాట్లాడుతూ 2020-21 మధ్య కాలంలో రైతులు తీసుకున్న వ్యవసాయ సంబంధిత రుణాలు మాఫీ చేయాలని మందపల్లి వాసులు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో పూర్తిస్థాయిలో విచారించి నివేదికలు పంపమని సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలందాయని, బ్యాంకుల నుంచి సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు.

రాయచోటి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ చామకూరి శ్రీధర్ హెచ్చరించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, పర్యవేక్షకులు, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజూ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు, అవగాహన సమావేశాలు నిర్వహించి జ్వరాలపై సర్వే నిర్వహించాలన్నారు. డెంగీ కేసులు నమోదైన గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లోని సీహెచ్‌వోలలో వర్షాకాలంలో ప్రతి రోజూ తాగునీటి నాణ్యత పరీక్షలు ప్రొటోకాల్ ప్రకారం చేయాలన్నారు. ప్రతి ఆరోగ్య సూచికలో వంద శాతం లక్ష్యాలు సాధించే విధంగా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు. సమీక్షలో డీఎంహెచ్‌వో డాక్టరు కొండయ్య, అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రెవెన్యూ సేవల్లో పారదర్శకత ముఖ్యం : కలెక్టర్

రాజంపేట, న్యూస్‌టుడే: ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవల్లో పారదర్శకత ఎంతో ముఖ్యమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. స్థానిక కొలంబలి కల్యాణ మండపంలో బుధవారం రాజంపేట రెవెన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల విన్నపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సేవల్లో నాణ్యతతో పాటు పారదర్శకత ఉండాలని సూచించారు. సీఎం కార్యాలయం నుంచి ఎన్ని ఫిర్యాదులు అందాయి వాటిల్లో ఎన్ని పరిష్కరించారు, సీసీఎల్ఏ, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులెన్ని వచ్చాయి, హైకోర్టు, జాతీయ మానవ హక్కులు, లోకాయుక్త కమిషన్ ద్వారా వచ్చిన కేసులెన్ని..? భూసేకరణ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ తీర్మానాల వంటి విషయాలపై సమగ్రంగా చర్చించారు. జేసీ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ నైదియాదేవి, జిల్లా సర్వే అధికారి భరత్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, పక్కన జేసీ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ నైదియాదేవి

అనుమతికి మించి నిల్వలుంటే లైసెన్సులు రద్దు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అనుమతికి మించి బాణాసంచా నిల్వలుంటే లైసెన్సులు రద్దు చేస్తామని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. బుధవారం తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు కదిరి రోడ్డులోని టిప్పు సుల్తాన్ మైదానాన్ని పరిశీలించారు. దీపావళి సందర్భంగా అనుమతులున్న తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు పట్టణంలోని మిషన్ కాంపౌండ్, టిప్పు సుల్తాన్ మైదానాల్లో అనుమతి ఇవ్వనున్నారు. లైసెన్సులు తీసుకుని, నిబంధనల ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేయాలని, విరుద్ధంగా వ్యవహరిస్తే అలాంటి దుకాణాలను రద్దు చేస్తామన్నారు. ప్రస్తుతం 36 తాత్కాలిక లైసెన్సులకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి దుకాణాలకు అనుమతులు ఇస్తామన్నారు. అగ్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తహసీల్దార్ ఖాజాబీ, కమిషనర్ ప్రమీల, సీఐ రామచంద్ర, ఎస్ఐ శివన్న, అధికారులు పాల్గొన్నారు.


టిప్పు సుల్తాన్ మైదానాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, అధికారులు

చెత్త సేకరణ సరే... వసతుల మాటేంటి?

ఎస్‌డబ్ల్యూపీసీలపై గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం
సదుపాయాల కల్పనపై ఎన్డీయే సర్కారు కసరత్తు


సుండుపల్లి మండలం జి.రెడ్డివారిపల్లెలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం

రాజంపేట పట్టణం, గ్రామీణ, సుండుపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛస్ఫూర్తితో ప్రతి గడప నుంచి చెత్తను సేకరించాలి. పల్లెసీమల్లో పరిశుభ్రత వాతావరణం కల్పించాలని సదాశయంతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీలు- సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్) నిర్మించారు. తరువాత ఎన్నికలు రావడంతో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. క్షేత్రస్థాయిలో మౌలిక వసతులను విస్మరించింది. నాటి సీఎం జగన్ సర్కారు నిర్వాకాలను గాలికొదిలేసింది. ఎన్డీయే కూటమి పాలకులు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అన్నిచోట్ల ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఉన్నతస్థాయి నుంచి ఉత్తర్వులందాయి. ఎక్కడెక్కడ ఎలాంటి వసతులున్నాయి, ఇంకా ఎలాంటి సదుపాయాలు అవసరమని సమాచారం సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

★ జిల్లాలో 501 గ్రామపంచాయతీలున్నాయి. పల్లెసీమల్లో 4,66,171 కుటుంబాలుండగా, 16.97 లక్షల మందికిపైగా జనాభా ఉన్నారు. ప్రతి గడప నుంచి తడి, పొడి వ్యర్థాలను సేకరించి సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేయాలని నిర్ణయించి అయిదేళ్ల కిందట అప్పటి తెదేపా పాలనలో 439 చోట్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఇందుకోసం నరేగా పద్దు రూ.15 కోట్లకుపైగా వెచ్చించారు. వీటిలో ప్రస్తుతం పూర్తిస్థాయిలో 320, పాక్షికంగా 96 పనిచేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చాలాచోట్ల వినియోగంలో లేవు. వైఎస్సార్ 26 కేంద్రాలు నిరుపయోగంగా ఉండగా, 62 చోట్ల నిర్మాణంలో ఉన్నాయి.

★ నెలకు రూ.6 వేల వేతనంతో క్లాప్‌మిత్రలు 1,187 మంది, కాపలాదారులు 439 మంది పనిచేస్తున్నారు. వైకాపా అధికారంలోకి వచ్చిన అనంతరం సిబ్బందికి ఆరేడు నెలలకో సారి కూడా జీతాలివ్వలేని పరిస్థితి నెలకొంది. మూడు చక్రాల రిక్షాలు 1,290, ఎలక్ట్రికల్ ఆటోలు 47 ఇవ్వగా, చాలాచోట్ల మూలన పడ్డాయి. సగానికి పైగా విద్యుత్తు సరఫరా కల్పించలేదు. గుక్కెడు నీరివ్వలేదు. కనీసం మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదు. చెత్త నిల్వ చేయడానికి అనువైన తొట్టెలను నిర్మించలేదు. కొన్నిచోట్ల చేపట్టినా దెబ్బతిన్నాయి. వానపాముల ఎరువు ఉత్పత్తి చేయలేదు. పంచాయతీలకు ఆశించిన స్థాయిలో కాదు కదా కనీసం మెప్పరుగా ఆదాయం సమకూరడం లేదు.

★ రాజంపేట మండలం మందపల్లి, మందరం, కొల్లావారిపల్లె, మిట్టమీదపల్లి, సుండుపల్లి మండలం బాగంపల్లి, ఈడిగపల్లి, జి.రెడ్డివారిపల్లె, సొంటంవారిపల్లె, మాచిరెడ్డిగారిపల్లెలోని కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవు. ఇక్కడే కాకుండా చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. గత అయిదేళ్లలో మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులివ్వాలని పంచాయతీ అధికారులు ప్రతిపాదనలు పంపినా అప్పటి సీఎం జగన్ ఏలుబడిలో మోక్షం లభించలేదు. అధికార యంత్రాంగం కూడా చేసేదేమీలేక వదిలేసింది.

★ ఎన్డీయే కూటమి పాలకులు అన్ని చోట్ల కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులు సన్నద్ధమవుతున్నారు. క్లాప్‌మిత్రలు, కాపలాదారులకు గత నెల వరకు రూ.17.39 కోట్లు వేతనాలు చెల్లించాల్సి ఉండగా, రూ.13.26 కోట్లు ఇచ్చామని చెబుతున్నా చాలాచోట్ల బకాయిలు అందలేదు. ఆదాయ వనరుల్లేని చిన్న పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తున్నా చాలవు. అటు అభివృద్ధి పనులకు, ఇటు పారిశుద్ధ్యం, విద్యుత్తు బిల్లుల బకాయిలు చెల్లించడానికి, పంచాయతీల నిర్వహణకు సర్దుబాటు చేయడం కష్టంగా ఉంటుంది. ఈ కారణంగా పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. ఇంకా రూ.4.13 కోట్లు ఇవ్వాలి. వీటిని కూడా త్వరగా చెల్లించాలని జిల్లా అధికారులు పంచాయతీ యంత్రాంగాన్ని తాజాగా ఆదేశించారు.

సమాచారం సేకరిస్తున్నాం

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అన్ని చోట్ల వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి ఎక్కడెక్కడ ఏం అవసరాలు కావాలో సమాచారం సేకరిస్తున్నాం. రహదారులు, తాగునీరు, విద్యుత్తు, కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తాం. సేంద్రియ ఎరువు తయారీ చేయించి రైతులకు విక్రయిస్తాం. పంచాయతీల ఆదాయాన్ని పెంచుతాం. క్లాప్‌మిత్రలు, కాపలాదారులకు వేతనాలు చెల్లిస్తాం.

- బాలకృష్ణారెడ్డి, డీపీవో, అన్నమయ్య జిల్లా

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రీసర్వే విభాగం డీటీ రాజేశ్ పేర్కొన్నారు. బుధవారం గ్రామీణ మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ వప్పిరెడ్డిగారిపల్లెలో సర్పంచి శరత్‌రెడ్డి అధ్యక్షతన రైతులు, భూయజమానులతో గ్రామసభ నిర్వహించారు. గతంలో నిర్వహించిన రీసర్వేలో తప్పిదాలు, తప్పొప్పుల సవరణకు బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో భూతగాదాలతో తేడా ఉన్నాయని, భాగ పరిష్కారానికి సంబంధించిన వివరాలు, సర్వే నక్షా మంగా చేయలేదని ఫిర్యాదులొచ్చాయి. వీటిపై రెవెన్యూ దస్త్రాలను, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, జనసేన నాయకులు శివరాం, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న డీటీ రాజేశ్, పక్కన అధికారులు

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట మండలం బయప్పగారిపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని ఎదుర్గుట్టను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు మహమ్మద్ అన్సారీ హెచ్చరించారు. గత కొన్నిరోజులుగా ఎదుర్గుట్టపై ఉన్న 5.35 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు చదును చేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. గత నెలలో దీనిపై తహసీల్దారుకు ఫిర్యాదు రాగా ఆక్రమణను అడ్డుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఫిర్యాదు రావడంతో బుధవారం తహసీల్దారు ఎదుర్గుట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు రాళ్లు, పొదలు, ముళ్లకంపలు తొలగించి చదును చేయగా గత నెలలో రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారని గుర్తు చేశారు. చదును చేసిన భూమిలో ఎవరికీ పట్టాలు, పాసు పుస్తకాలు జారీ చేయడం లేదని వివరించారు. మండల ఆర్ఐ వీరాంజనేయులు, సర్వేయరు సుధాకర్, వీఆర్వో రవికుమార్, తహసీల్దారు వెంట ఉన్నారు.


శీలంవారిపల్లె వద్ద చదును చేసిన గుట్టను పరిశీలిస్తున్న తహసీల్దారు మహమ్మద్ అన్సారీ

మదనపల్లెలో సత్య షోరూం ప్రారంభం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: మదనపల్లె పట్టణం సీటీఎం రోడ్డులో బుధవారం సత్య షోరూంను ప్రారంభించారు. షోరూం ఏజెన్సీ ఎండీ సత్య తరఫున సత్యరాజ్, సీనియర్ డీజీఎం ఆనంద్‌కుమార్, డీజీఎం గంగాధర్, ఏజీఎం ఉదయ్ సమక్షంలో బిల్డింగ్ యజమాని మాకం అశోక్‌కుమార్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ... మదనపల్లెలో సత్య ఏజెన్సీస్ ఆధ్వర్యంలో 39వ సత్య షోరూంను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పట్టణ ప్రజలు మెచ్చే గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయన్నారు. ఏ ఫోను, స్మార్ట్‌ఫోన్లు కూడా వాయిదాల పద్ధతిలో చెల్లించి సొంతం చేసుకోవచ్చన్నారు. మదనపల్లె పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాలలోని ప్రజలు సత్య షోరూంను వచ్చి వస్తువులు కొనుగోలు చేసి మంచి ఆఫర్లను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్టోర్ మేనేజరు మహేంద్ర పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.


సత్య షోరూంను ప్రారంభిస్తున్న సత్యరాజ్, సీనియర్ డీజీఎం ఆనంద్, అశోక్‌కుమార్, పుర ప్రముఖులు

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న ఔషధ నియంత్రణ అధికారి కేశవరెడ్డి, పక్కన నిర్వాహకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని మదనపల్లె ఔషధ నియంత్రణ అధికారి కేశవరెడ్డి అన్నారు. బుధవారం మదనపల్లె మండలం బసినికొండలోని శ్రీ కృష్ణ చైతన్య నర్సింగ్, ఫార్మసి కళాశాలలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై నెహ్రూ యువ కేంద్రం, గ్రామజ్యోతి సొసైటీల ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ... చాలా మంది యువత మత్తు పదార్థాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అలాగే మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల నిద్ర సక్రమంగా పట్టకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, అల్సర్లు రావడం, కళ్లకింద నల్లని వలయాలు ఏర్పడటం వంటి రుగ్మతలు వస్తాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు వాటి నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామజ్యోతి సొసైటీ వ్యవస్థాపకురాలు సుభద్ర, కళాశాల కరస్పాండెంట్ రాంమోహన్‌రెడ్డి, అధ్యాపకులు గోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, డాక్టర్ వసంత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'నిరుద్యోగుల సంక్షేమం పట్టని ప్రభుత్వం'

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వానికి నిరుద్యోగ సంక్షేమం పట్టడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. బుధవారం సంతగేటులోని పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వాలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వాలంటీర్ల ప్రస్తావన, వారి సమస్యలు చర్చించకపోవడం శోచనీయమన్నారు. ఈ నెల 26న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మదనపల్లెలో వాలంటీర్ల సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. దీన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సలీమ్‌బాషా, వేణుగోపాల్‌రెడ్డి, అలివేలమ్మ, వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరులోని బాలికల గురుకులానికి చెందిన పదో తరగతి విద్యార్థినులు అక్షయ, హర్షిత ఖోఖో, హేమశ్రీ కబడ్డీ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రాధారాణి బుధవారం తెలిపారు. ఇటీవల చిత్తూరు, రాయచోటిల్లో జరిగిన క్రీడల్లో సత్తాచాటిన ఈ విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎంపికవడం పాఠశాలకు గర్వకారణమని ఆమె అన్నారు. వచ్చే నెల 2 నుంచి 4 వరకు అనకాపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు తరఫున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని ఆమె తెలిపారు. ఉప ప్రిన్సిపల్ పుష్పలత, పీఈటీ అమరావతి విద్యార్థినులను అభినందించారు.


రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ రాధారాణి

సంఘమిత్రపై డీఆర్‌డీఏ అధికారుల విచారణ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని పోతబోలు పంచాయతీ సంఘమిత్రపై వచ్చిన ఆరోపణలపై డీఆర్‌డీఏ అధికారులు బుధవారం రెండో విడత విచారణ చేపట్టారు. గత నెల 30న సంఘమిత్ర పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని సంబంధితశాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించడంతో బ్యాంకు లింకేజ్ బీపీఎం లక్ష్మీప్రసాద్‌రెడ్డి విచారణ చేపట్టారు. పావలా వడ్డీ రుణాలు కల్పించడం లేదని, గ్రూపులోని డబ్బులు సకాలంలో గ్రూప్ సభ్యులకు ఇవ్వకుండా తాను వాడుకుని తరువాత ఇవ్వడం, సకాలంలో బ్యాంకు రుణాలు ఇప్పించడం లేదని ఆరోపిస్తూ సంఘమిత్ర పుణ్యవతిపై ఫిర్యాదు చేశారు. మొదటి విడత కింద ఈ నెల 8వ తేదీన కొన్ని సంఘాలకు సంబంధించిన దస్త్రాలను తనిఖీ చేశారు. రెండో విడత విచారణలో భాగంగా బుధవారం గ్రామీణ మండలంలోని సంఘమిత్ర పరిధిలో ఉన్న మహిళా సంఘాల సభ్యులకు సంబంధించి దస్త్రాలను పరిశీలించి వారి నుంచి వివరాలను సేకరించారు. పెండింగ్‌లో ఉన్న 12 గ్రూప్‌లను విచారించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు బీపీఎం తెలిపారు. ఈ సందర్భంగా పోతబోలు క్లస్టర్ సీసీలు లక్ష్మీదేవి, శారద, పొన్నూటిపాళ్యం సీసీ శివశంకర్, కొత్తపల్లె క్లస్టర్ గంగులప్ప, సీటీయం క్లస్టర్ గోపాలు తదితరులు పాల్గొన్నారు.


సంఘాల దస్త్రాలను తనిఖీ చేస్తున్న బ్యాంకు లింకేజీ బీపీఎం లక్ష్మీప్రసాద్‌రెడ్డి, డ్వాక్రా మహిళా సమాఖ్య సీసీలు

జిల్లాలో 25 నుంచి పశుగణన

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో పశుగణన సక్రమంగా చేయాలని పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. ఈ నెల 25 నుంచి పశుగణన ప్రారంభమవుతున్న సందర్భంగా సిబ్బందికి బుధవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. అయిదేళ్లకో సారి జరిగే గణనలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆ ఇంటిలో గొర్రెలు, మేకలు, కోళ్లు, ఆవులు, ఎద్దులు, ఎనుములు, ఇతర పశు పక్ష్యాదులు ఎంత మేరకు ఉన్నాయో లెక్కించి, పుస్తకంలో నమోదు చేయాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లినపుడు రైతుతో మాట్లాడి, వారు ఇచ్చిన వివరాల మేరకు పశు సంపదను లెక్కించాక, ఆ ఇంటికి గణన జరిగినట్లుగా ఒక స్టిక్కరును అతికించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందజేసిన పుస్తకాల్లోనే కాకుండా ఆన్‌లైన్‌లో ఖచ్చితమైన పశుగణన మరోసారి సరి చూసుకుని నమోదు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ గణన సక్రమంగా, ఖచ్చితంగా ఉన్న పశు సంపదను లెక్కించి, పుస్తకంలో నమోదు చేయాలని ఆదేశించారు. కోడిగుడ్ల ఉత్పత్తిలో దేశంలో రాష్ట్రం తొలి స్థానంలో, మాంసం ఉత్పత్తిలో నాలుగో స్థానం, పాల ఉత్పత్తిలో 5వ స్థానంలో ఉందన్నారు. సమావేశంలో డివిజన్‌లోని సహాయ సంచాలకులు విశ్వేశ్వర్‌రెడ్డి, రోహిణి, కల్యాణ్, నీరజ, వెంకట ముని నాయుడు, సుమతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ సత్యనారాయణ, పక్కన ఏడీలు

సమస్యలపై గ్రామసభకు 21 వినతులు

కలికిరి గ్రామీణ, న్యూస్‌టుడే: రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు మహేశ్వరీబాయి తెలిపారు. బుధవారం టి.సంగ్రవారిపల్లెలో జరిగిన గ్రామసభలో 21 మంది రైతులు వివిధ సవరణలు, భూసమస్యలపై అర్జీలను అందజేసినట్లు వివరించారు. 24న మహల్, 25, 26 తేదీల్లో పారపట్ల, 29న మునోళ్లపల్లె, 30న చీకటిపల్లె, నవంబరు 2న కొర్లకుంట, 4న పల్లవోలు, 5న పత్తేగడ, 6న కలికిరి, 7, 8 తేదీల్లో గుట్టపాళెం, 12, 13 తేదీల్లో గుండ్లూరు, 14, 15 తేదీల్లో మేడికుర్తి గ్రామాల్లో సభలు జరుగుతాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

డీలర్ల సర్వసభ్య సమావేశం నేడు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లెలో గురువారం జిల్లాలోని రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మదనపల్లె అధ్యక్షుడు ఇమాం ఖాసీమ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలపై చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రేషన్ డీలర్లు అందరూ హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో మదనపల్లె రూరల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, డివిజన్ ఉపాధ్యక్షుడు ముంతాజ్, సభ్యులు కవిత, మురళి, మహేశ్వర్, కళాధర్, అంజనప్పతో పాటు పలువురు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మదనపల్లె మండలంలో బుధవారం సాయంత్రం జరిగింది. కోళ్లబైలు పంచాయతీ జగన్ కాలనీకి చెందిన స్వాతి (35) పదేళ్ల క్రితం భర్త దేవరాజ్‌ను విబేధించి వేరుగా అద్దె ఇంట్లో ఉంటోంది. తన ఇద్దరు పిల్లలను తనతో పాటు ఉంచుకుని తమలపాకుల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఆమె ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పాఠశాల నుంచి వచ్చిన ఇద్దరు కుమారులు తల్లిని చూసి కేకలేయడంతో స్థానికులు వచ్చి చూశారు. అప్పటికే ఆమె మృతి చెంది ఉండటంతో రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ హరిహరప్రసాద్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్వాతి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఆత్మహత్య చేసుకున్న సమయంలో తలుపులు తెరిచి ఉండటంతో పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వాసుపత్రి శవాగారానికి తరలించారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

వృద్ధురాలిపై కొడవలితో దాడి

మదనపల్లె నేరవార్తలు: వృద్ధురాలిపై మహిళ కొడవలితో దాడి చేసి తలపై నరికిన సంఘటన మదనపల్లె మండలంలో బుధవారం రాత్రి జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లె మండలం వేంపల్లె గ్రామానికి చెందిన శివమ్మ కూలి పనులు చేస్తుంది. ఆమెను అదే గ్రామానికి చెందిన మహిళ శ్రీదేవి పని విషయమై మందలించింది. దీంతో శివమ్మ సాయంత్రం ఇంటికి వచ్చి తన అత్త రమణమ్మ (60)కు తెలియజేసింది. తమ కోడలిని తిట్టిన శ్రీదేవిని ఆమె నిలదీసింది. దీంతో ఆగ్రహించిన శ్రీదేవి కొడవలితో రమణమ్మ తలపై నాలుగు చోట్ల నరికింది. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

జాతీయ రంగోత్సవ్‌లో విద్యార్థినుల ప్రతిభ

కలికిరి, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో నిర్వహించిన రంగోత్సవ్ పోటీల్లో కలికిరి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ సోమశేఖర్ అన్నారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రతిభ చాటిన విద్యార్థినులకు పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. జాతీయ స్థాయి రంగోత్సవ్ పోటీల్లో 80 మంది పాల్గొన్నారన్నారు. వారిలో పదో తరగతికి చెందిన కావ్య (ఆర్ట్‌మెరిట్) మొదటి స్థానాన్ని దక్కించుకోగా.. చేతిరాత పోటీల్లో పదో తరగతి విద్యార్థిని అంజలి కన్సోలేషన్ బహుమతి అందుకుందన్నారు. డ్రాయింగ్, తంబ్ పెయింటింగ్, కార్టూన్ మేకింగ్, చేతిరాత, గ్రీటింగ్ కార్డుల తయారీ పోటీల్లో బంగారు పతకాలు 10, రజత పతకాలు 8, కాంస్య పతకాలు నలుగురు విద్యార్థినులకు వరించాయని చెప్పారు. బెస్ట్ స్కూల్ ఫర్ ఫ్యూచర్‌స్టిక్ ఎడ్యుకేషన్ అవార్డు, ప్రధానోచార్యులు సోమశేఖర్‌కు ప్రత్యేకంగా జ్ఞాపిక అందుకున్నారు.


విద్యార్థినికి పతకం అందిస్తున్న ప్రిన్సిపల్ సోమశేఖర్, ఉపాధ్యాయులు



తహసీల్దార్ భీమేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న మాల మహానాడు ఐక్యవేదిక నాయకులు

ఎస్సీల కులగణన చేపట్టాలి

పీలేరు గ్రామీణ: కుగ్రామాల నుంచి ఎస్సీల కులగణన చేపట్టాలని మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ డిమాండ్ చేశారు. తహసీల్దార్ భీమేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కేంద్రం తీసుకున్న ఎస్సీ వర్గీకరణ నిర్ణయంలో భాగంగా కులగణన చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కా వెంకట్రమణ, రాయలసీమ సమన్వయకర్త రామాంజులు, గౌరవ సలహాదారు జయరామచంద్రయ్య పాల్గొన్నారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

కర్రంటు స్తంభం

నిమ్మనపల్లె పంచాయతీ ముద్దిరెడ్డిగారిపల్లె సమీపంలో పాము కుంటవంక వద్ద విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొద్దికొద్దిగా వంగిపోతున్న స్తంభానికి రైతులు కర్రలు పోటుగా అమర్చారు. స్తంభం బరువుకు కర్రలు ఏ మాత్రం విరిగినా ప్రమాదం తప్పదు. నిత్యం రైతులు సంచరించే ఈ ప్రాంతంలో ప్రమాదం జరగకముందే విద్యుత్తు సరఫరా ఉండే స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, నిమ్మనపల్లె



మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

- న్యూస్‌టుడే, వాల్మీకిపురం

?: పట్టణంలోని కొత్తపేటవీధి నుంచి సీఎస్ఐ చర్చికి పోయే దారిలో మురుగు కాలువ పైకప్పు దెబ్బతిని గుంతగా మారింది. తాత్కాలికంగా వేసిన బండరాళ్లు ప్రమాదకరంగా మారాయి?
- ప్రభుకిరణ్, వాల్మీకిపురం

✓: సమస్యను పరిశీలించి, ప్రమాదకర స్థాయిలో ఉన్న గుంతను పూడ్చి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటాం. **- రవీంద్రనాథ్, పంచాయతీ ఈవో, వాల్మీకిపురం**

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: గ్రామీణ మండలం వైఎస్ఆర్ కాలనీ పంచాయతీ మారుతీనగర్ ఎగువ ప్రాంతంలో తాగునీటి పైపులైను లీకవుతోంది. రోడ్డుపై నీరు వృథాగా వెళ్తుండటంతో పాటు మురుగు పేరుకుంది?
- సుబ్రహ్మణ్యం, మారుతీనగర్

✓: మరమ్మతులు చేయించి, లీకేజ్ లేకుండా చర్యలు చేపడతాం. **- మస్తాన్‌వల్లి, ఎంపీడీవో, మదనపల్లె**

?: రాజీవ్‌నగర్ విస్తరణ ప్రాంతంలో రిలయన్స్ పెట్రోల్ బంకు పక్కవీధిలో కాలువలు లేక ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్వాసన వస్తోంది?
- జాఫర్, పుంగనూరు రోడ్డు

✓: పారిశుద్ధ్య పనులు చేయిస్తాం, కాలువ నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
- ప్రమీల, కమిషనర్, పురపాలక సంఘం, మదనపల్లె

?: మదనపల్లె గ్రామీణ మండలం చెంబుకూరు రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్ సమీపంలో చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. దుర్వాసనతో దోమలు, ఈగల నిలయంగా మారింది, రోగాలు ప్రబలే అవకాశాలున్నాయి?
- మహేశ్, చెంబుకూరు రోడ్డు

✓: చెత్తదిబ్బలు లేకుండా కార్మికులచే శుభ్రం చేయించే చర్యలు తీసుకుంటాం. **- అబ్దుల్‌షుకూర్, ఈవోపీఆర్డీ**

వీధికో భైరవద్వీపం

● కుక్కల నియంత్రణ పట్టని పురపాలిక
● పూడిక నిండిన కాలువలతో పెరుగుతున్న దోమలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే బాధ్యత పురపాలక సంఘానిదే. ప్రజలు పన్ను రూపంలో చెల్లించే డబ్బులు వినియోగించి ప్రజలకు ఏది అవసరమో వాటిని సమకూర్చి వారు ప్రశాంతమైన వాతావరణంలో జీవించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రధానమైన ప్రజల ఇబ్బందులను గుర్తించి వీటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి. పట్టణ ప్రజల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని ఆ సమస్యకు పరిష్కారం చూపాలి. మదనపల్లె పురపాలక సంఘంలో ఆ విధమైన పరిష్కారాలు చూపుతున్నారా? అన్న సమస్య ఉత్పన్నమౌతోంది.

రహదారులపై వీధి కుక్కల హల్‌చల్

మదనపల్లె పురపాలక సంఘంలో ఏ వీధికి వెళ్లిన కుక్కలు మందలుగా దర్శనమిస్తున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో రోడ్లపై వెళ్లాలంటే ప్రజలు ప్రాణాలరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. పట్టణంలోని సొసైటీ కాలనీలో కుక్కలు రోడ్లపై గస్తీ తిరుగుతున్నాయి. ఇక్కడ పాఠశాలలు ఉండటంతో విద్యార్థులు తెలియకుండా రోడ్లపై వెళుతుంటారు. ఇలాంటి సమయంలో కుక్కలు వారిపై దాడి చేసే ప్రమాదం ఉంది. విజయ భారతి ఆంగ్ల మాధ్యమ పాఠశాల పరిసరాల్లో కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. వీటికి భయపడి తమ పిల్లలను తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో తీసుకొచ్చి వదిలి వెళుతున్నారు. కొంత మంది విద్యార్థులు కుక్కల దాడిలో గాయపడిన ఘటనలు న్నాయి. కుక్కల సంతానోత్పత్తిని నియంత్రించడానికి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కంపోస్టు యార్డులో ఏర్పాటు చేసిన జంతు జనన నియంత్రణ కేంద్రం మూతపడింది.



రెడ్డీస్ కాలనీలో కాలువ గట్టుపై పిచ్చిమొక్కలు

మైనర్ల చేతిలో ద్విచక్ర వాహనాలు

ఈ మధ్య తల్లిదండ్రులు తమ పిల్లలపై అత్యంత గారాభం చూపుతున్నారు. రహదారి సూత్రాలపై కనీస అవగాహన లేని వారికి ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్డుపైకి పంపుతున్నారు. ముందు జరగబోయే ప్రమాదాన్ని గుర్తించకుండా తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి వారు నడుపుతుంటే మురిసిపోతుంటారు. ఇది తప్పని తెలుసుకోలేదని తల్లిదండ్రులు ప్రమాదం జరిగిన తర్వాత పశ్చాత్తాపం చెందినా ప్రయోజనం ఉండదు. సొసైటీ కాలనీలో ఇద్దరు బాలురు ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై అతివేగంగా నడిపి వృద్ధున్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అతని కాలు విరిగిపోయింది. ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. దీన్ని పోలీసు అధికారులు నియంత్రించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కన పడుకున్న కుక్కల గుంపు

కాలువ గట్లపై పిచ్చి మొక్కలు

సొసైటీ కాలనీ, రెడ్డీస్ కాలనీల్లోని మురుగు కాలువలపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో దోమలు వృద్ధి చెంది ఇళ్లలోకి వస్తున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కాలువల్లో పూడిక తీయడం లేదని, గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించడానికి పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేసి ప్రజలు ఆరోగ్యంగా జీవించడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శిథిల పైకప్పు... తప్పదు ముప్పు!

అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించేందుకు ఇటీవల ప్రభుత్వం నిధులు విడుదల చేసినా భవనాల మరమ్మతులకు మంజూరు చేయలేదు. చాలా కేంద్రాలు దెబ్బతిన్నా మరమ్మతులకు నోచుకోక భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పీలేరు మండలంలో తలపుల, దొడ్డిపల్లె, నాలేవాండ్లపల్లె, పీలేరు పంచాయతీ శ్రీనాథ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు దెబ్బతిన్నా అందులోనే విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనాథ కాలనీ భవనం పైకప్పు పెచ్చులూడి ఇనుప కడ్డీలు కనిపిస్తున్నాయి. భవనం దుస్థితి చూసి పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా ఫలితం లేకుంది. ప్రజాప్రతినిధులు అధికారులు తగిన చర్యలు తీసుకుని కేంద్రం మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పీలేరు**



శ్రీనాథకాలనీ అంగన్‌వాడీ కేంద్రం దుస్థితి

ఏసీ అని ఎక్కారు... ఎక్స్‌ప్రెస్‌కు మారారు

పీలేరు పట్టణం జాతీయ రహదారి వంతెన పనులు జరుగుతున్న ప్రాంతంలో మదనపల్లె-తిరుపతి మధ్య తిరిగే ఆర్టీసీ ఏసీ బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడిన ఘటన ఇది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో తిరుపతి నుంచి మదనపల్లెకు వెళ్తున్న ఏసీ బస్సు (ఏపీ39 యుక్యూ 5382) ఉన్నపలంగా నిలిచిపోయింది. డ్రైవర్ దిగి చూడడంతో కుడివైపున ఉన్న టైర్లు పంక్చర్ అయ్యాయి. దీంతో డ్రైవర్ మార్గం మధ్యలో చేసేదేమీ లేక తిరుపతి నుంచి అనంతపురం వెళ్తున్న ధర్మవరం బస్సులో ప్రయాణికులను ఎక్కించి పంపారు. ఏసీ టిక్కెట్టు ఇచ్చి ఎక్స్‌ప్రెస్ బస్సులో నిలుచుని వెళ్లాల్సి వచ్చిందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, పీలేరు**



పీలేరులో ఏసీ బస్సు నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సుకు మారుతున్న ప్రయాణికులు

డయల్ యువర్ డీఎం నేడు

పీలేరు: పీలేరు డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం బండ్ల కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసుల సమయం మార్చడం, సమస్యలు ప్రస్తావించడంతో పాటు సంస్థ ఆదాయం పెంపునకు సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రజలు 99592-25679 చరవాణి నంబరుకు కాల్ చేసి సలహాలు ఇవ్వాలని కోరారు.

నిబంధనల మేరకు దుకాణాల ఏర్పాటు

పీలేరు గ్రామీణ: దీపావళి సందర్భంగా నిర్వహించే టపాసుల దుకాణాలు నిబంధనల ప్రకారం నిర్వహించుకోవాలని తహసీల్దార్ భీమేశ్వరరావు అన్నారు. బుధవారం పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో టపాసుల దుకాణాల విక్రయాలను కేటాయించిన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే దుకాణాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సర్వేయర్ స్కెచ్ ప్రకారం ఉండాలని ఆయన చెప్పారు. సీఐ యుగంధర్, అగ్నిమాపక కేంద్ర అధికారి మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు పట్టణంలో రైల్వే పైవంతెన పనులు జరుగుతున్నందున రోడ్డుకు ఇరువైపులా విద్యుత్తు స్తంభాలు, తీగలు మార్చాల్సిన పరిస్థితులు వచ్చాయని అందువల్ల వారం రోజుల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎస్పీడీసీఎల్ ఏఈ ఖాదర్ ఇలాహీ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... అజంతామిట్ట, అయ్యప్పరెడ్డి కాలనీ, ఇందిరానగర్, రైల్వేగేట్ పరిసర ప్రాంతాల్లోని వినియోగదారులకు పగలు విద్యుత్తు సరఫరా అంతరాయం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సాయంత్రం నుంచి ఉదయం వరకు ఇళ్లకు విద్యుత్తు సరఫరా ఇస్తామని ఖాదర్ ఇలాహీ వివరించారు.

విద్యా సామగ్రి పంపిణీ

రామసముద్రం, న్యూస్‌టుడే: మదనపల్లె గ్రామీణ మండలం ఆవులపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం సినీ హీరో ప్రభాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు 50 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, పరీక్ష అట్టలు, జామెట్రీ బాక్సులను పంపిణీ చేశారు. విద్యార్థులకు తినడానికి కేకులు, ఆపిల్ పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రభాస్ అభిమానులు గంగరాజు, చలపతి, చంద్రశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఐ.పై చర్యలకు వినతి

గుర్రంకొండ, కలికిరి : దళిత నేతను తిట్టి మనస్తాపానికి గురి చేసిన వాల్మీకిపురం ఎస్.ఐ.పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని దళిత నేతలు బుధవారం డిమాండు చేశారు. గుర్రంకొండ, కలికిరి మండలాల్లో మాల మహానాడు నాయకులు మాట్లాడారు. జిల్లా అధ్యక్షులు చింతపర్తి శివయ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాల మహానాడు జిల్లా కార్యదర్శి గాంధీపేట రఘును వాల్మీకిపురం ఎస్.ఐ. చరవాణిలో దుర్భాషలాడారని తెలిపారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నాగరాజు, టీవీ రమణ, ఈశ్వరయ్య, రెడ్డి గంగులప్ప, రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఠాణాలో డీఎస్పీ తనిఖీ

పీలేరు గ్రామీణ: పీలేరు పోలీసు స్టేషన్‌లో బుధవారం రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడకుండా ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. అనంతరం కేసుల నమోదు దస్త్రాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రాత్రివేళల్లో మద్యం మత్తులో ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై అనవసరంగా రోడ్లపై తిరిగినా, గొడవలు సృష్టించినా ఉక్కుపాదంతో అణచి వేస్తామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. పీలేరులో రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు విద్యార్థులపై డీఎస్పీ ఆరా తీశారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే : చింతపండు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన సహకారం అందిస్తామని తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి తెలిపారు. ఎర్రబల్లి పంచాయతీ చెన్నామర్రి మిట్టకు సమీపాన ఉన్న పరిశ్రమను బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఏపీఎంలు నీరజ, శ్రీనివాసులు తెదేపా నేతకు చింతపండు పరిశ్రమ గురించి వివరించారు. అనంతరం తెదేపా నేత అంగళ్లులోని కుండల తయారీని సందర్శించి, అక్కడి పరిశ్రమ పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త మల్లికార్జున నాయుడు, తెదేపా నాయకులు డీఆర్ వెంకట రమణారెడ్డి, తులసీధర్ నాయుడు, అయూబ్, రుద్రబాలకృష్ణ, రాఘవరెడ్డి, సూరి, ఎల్లారెడ్డి, ముస్తఫా, సురేష్, భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, సూరి తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బుధవారం తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి బాధితులకు పంపిణీ చేశారు. బి.కొత్తకోట మండలం, గొల్లపల్లెకు చెందిన మహబూబ్ బాషా దరఖాస్తు చేసుకోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సాయం మంజూరు కావడంతో తెదేపా నేత జయచంద్రారెడ్డి మహబూబ్‌బాషాకు రూ.1,93,502 చెక్కును తెదేపా కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి గిరిధర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేస్తున్న తెదేపా నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి

ఎమ్మెల్యే చొరవతో కాలువకు మోక్షం

పీలేరు గ్రామీణ: మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ పరిధిలోని ఎర్రదొడ్డిపల్లె చెరువు, అటు నుంచి కొత్తపల్లె సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు పింఛా నది నుంచి నీటి సరఫరా కాలువలు ఉన్నాయి. అయిదేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో పూడిక నిండి పిచ్చిమొక్కలు పెరిగాయి. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో ఈవో గురుమోహన్, యల్లల రెడ్డిప్పరెడ్డి యంత్రాల సాయంతో చేస్తున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు.

గంగిరెడ్డికి సత్కారం

పీలేరు, న్యూస్‌టుడే: సాంఘిక సేవలో ఇటీవల హైదరాబాదులో గౌరవ డాక్టరేట్ అందుకున్న జానం గంగిరెడ్డిని బుధవారం వెలుగు కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఘనంగా సత్కరించారు. యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ... గంగిరెడ్డి 'విస్' సంస్థను ఏర్పాటు చేసి నిరుద్యోగ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంతో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మారారని చెప్పారు. మాల మహానాడు నాయకులు ధరణీకుమార్, జెట్టి మల్లికార్జున మాట్లాడుతూ... పేదల అభ్యున్నతికి గంగిరెడ్డి సామాజిక కార్యక్రమాలు నిర్వహించి అనేక సమస్యలు పరిష్కరించారని కొనియాడారు. ఎన్ఎస్‌యూఐ అమృతతేజ, బాబ్జాన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చిరంజీవి, వ్యవసాయ వృత్తిదార్ల సంఘం అధ్యక్షుడు గట్టప్ప, పటాన్‌జాకీర్, కోర్ రాజమ్మ, షర్మిల, మేము సైతం షాహిన్ తదితరులు గంగిరెడ్డిని సన్మానించి అతని సేవలను కొనియాడారు.



గంగిరెడ్డిని సన్మానిస్తున్న కార్యదర్శి గురుమోహన్

విద్యార్థినిని పరామర్శించిన డీవైఈవో

మదనపల్లె విద్య: ఆత్మహత్యకు యత్నించిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినిని బుధవారం మదనపల్లె డీవైఈవో శ్రీరామ పురుషోత్తం పరామర్శించారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని కోలుకోవడంతో బుధవారం ఆసుపత్రి నుంచి ఇంటికి పంపారు. ఈ సందర్భంగా డీవైఈవో విద్యార్థినితో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. రాత్రుళ్లు విద్యాలయంలో ఉండటం తనకు ఇష్టం లేదని రామసముద్రంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరుతానని ఆమె చెప్పారు. ఆమె ఇష్ట ప్రకారమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని సూచించారు. రూటా రాష్ట్ర నాయకులు మహమ్మద్‌ఖాన్, విద్యార్థిని తల్లిదండ్రులు ఉన్నారు.

స్పందన ఫిర్యాదుపై డీఎల్‌పీవో విచారణ

పెద్దమండ్యం: మండలంలోని పారిశుద్ధ్యంతో పాటు ఇతర సమస్యలపై ముసలికుంటకు చెందిన మంజునాథ కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం డీఎల్‌పీవో నాగరాజ ముసలికుంట సచివాలయంలో ఫిర్యాదుదారుడిని, పంచాయతీ కార్యదర్శి, సర్పంచి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. తాగునీరు సక్రమంగా రాలేదని, 2019లో శుద్ధి జల కేంద్రాన్ని పంచాయతీకి అప్పగిస్తే దాన్ని అందుబాటులోకి తీసుకురాలేదని, మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి, పారిశుద్ధ్య పనులు చేపట్టలేదని ఫిర్యాదు చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఈవోఆర్డీ జనార్ధన్, పాల్గొన్నారు.

సృజనకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మదనపల్లె విద్య, పట్టణం, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో మదనపల్లెలోని విద్యోదయ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో ప్రతిభా పాటవ పోటీలు బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జి.శృతి వైష్ణవి (9వ తరగతి), ఎన్.అభినయ్ కుమార్ నాయుడు (8వ తరగతి), కె.జ్ఞానసాయి (8వ తరగతి)లకు ప్రిన్సిపల్ ఝాన్సీలక్ష్మీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రదీప్, మోహన్, భారతి, శ్రీదేవి, నరసింహారెడ్డితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలతో విద్యోదయ ఇంగ్లిషు మీడియం పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీలక్ష్మీ, ఉపాధ్యాయులు

వంకను పూడ్చేస్తున్నారని ఫిర్యాదు

మదనపల్లె గ్రామీణ: పట్టణంలోని గుట్టవంకను కొందరు పూడ్చేస్తున్నారని బుధవారం రెడ్డీస్ కాలనీకి చెందిన స్థానికులు తహసీల్దార్ ఖాజాబీకి ఫిర్యాదు చేశారు. గ్రామీణ మండలం వన్నూర్‌సాబ్ గుట్ట నుంచి పట్టణంలోని కురవంక వరకు దాదాపు మూడు కిలోమీటర్ల వరకు ఈ వంక విస్తరించిందని, ఇప్పటికే ఎగువ ప్రాంతంలో వంకను అక్రమార్కులు పూడ్చేశారన్నారు. రెడ్డీస్ కాలనీలోని అపార్ట్‌మెంట్ల వెనుక ఉన్న ఈ వంక స్థలాన్ని టిప్పర్లు, ట్రాక్టర్లతో వ్యర్థపు మట్టిని తెచ్చి వేస్తున్నారని, దీంతో చదునుచేసి ఆక్రమణలకు యత్నాలు సాగుతున్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆమె స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి వంక ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐ రెడ్డెప్పను ఆదేశించారు.

పల్లకిపై గంగమ్మ ఊరేగింపు

రామసముద్రం: రామసముద్రం మండలం నవగానిపల్లెలో బుధవారం గంగమ్మ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. అమ్మవారిని పుష్పపల్లకిపై ఊరేగిస్తూ ఇంటింటా పూజలు చేసి కర్పూర హారతులు పట్టారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని గ్రామస్థులు అమ్మవారికి మొక్కులు మొక్కుకున్నారు.

లోకేశ్‌ను కలిసిన సీతప్ప

రామసముద్రం: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను తెదేపా జిల్లా కోశాధికారి సీతప్ప కలిశారు. ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో మదనపల్లె నియోజకవర్గ నాయకులు యశశ్వి రాజ్ ఆధ్వర్యంలో కలసినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని లోకేశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



నారా లోకేశ్‌తో సీతప్ప

వీఆర్ఏ కుటుంబానికి ఆర్థిక సాయం

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలోని తరిగొండకు చెందిన వీఆర్ఏ రెడ్డిశేఖర్ బుధవారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన దహన సంస్కారాలకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పీఏ సత్య పంపిన ఆర్థిక సాయాన్ని స్థానిక తెదేపా నేతల సమక్షంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. రూ.15 వేలు ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ మైనారిటీ కమిటీ సభ్యులు నౌషాద్ అలీ, తెదేపా నేతలు చంద్రబాబు, ప్రదీప్‌చంద్, ఎసాన్‌అలీ, మునిశేఖర్, ఓబులేషు తదితరులు పాల్గొన్నారు.

దారులు అధ్వానం... వానొస్తే నరకం

● గుంతలతో ప్రయాణికుల ఒళ్లు హూనం ● వాహనాలు దెబ్బతింటున్నాయంటున్న చోదకులు

ములకలచెరువు, కురబలకోట, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని రహదారులు అధ్వానంగా మారాయి... వానొస్తే ఇక ప్రయాణం నరకమే. గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో రహదారుల అభివృద్ధిని గాలికొదిలేసింది. దీంతో ఏళ్ల క్రితం వేసిన రహదారులు గుంతలు తేలి వర్షాకాలంలో మరింత ప్రమాదకరంగా మారాయి. వీటిపై ప్రయాణించే వారికి ఒళ్లు హూనమవుతుండగా బళ్లు దెబ్బతింటున్నాయని చోదకులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా రహదారుల ప్రగతిపై దృష్టి సారించి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

● తంబళ్లపల్లె నియోజకవర్గంలో పలు రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉండడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే దారులు గుంతలమయంగా మారాయి. కూటమి ప్రభుత్వంలో అయినా వీటికి మోక్షం కలుగుతుందేమోనని వాహన చోదకులు ఎదురు చూస్తున్నారు. తంబళ్లపల్లె మండలంలోని తారకరామ కాలని, బల్లాపురంవాండ్లపల్లిల్లో దారుల దుస్థితి అధ్వానంగా ఉంది. సిమెంటు రోడ్లు అసంపూర్తిగా వదిలేశారు. ● పీటీఎం మండలంలోని జంబుగానిపల్లి వద్ద రెండేళ్ల క్రితం వంతెన వరదల కారణంగా కొట్టుకుపోవడంతో రహదారి అధ్వానంగా తయారైంది. ద్విచక్ర వాహనాదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. గత పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదు. పీటీఎం అంకిరెడ్డిపల్లి రోడ్డు తారు లేచిపోవడంతో గుంతలమయంగా మారింది. రోజూ వాహనదారులు పడుతూ లేస్తూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ● ములకలచెరువు మండలంలో చౌడసముద్రం - కాలువపల్లి రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ఈ మార్గంలో వెళ్లే చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై గుంతలతో 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటే గంటకు పైగా సమయం పడుతోంది. ● ములకలచెరువు - తంబళ్లపల్లె వెళ్లే దారి కూడా దారుణంగా ఉంది. దీంతో ప్రయాణికులు ములకలచెరువు నుంచి చౌడసముద్రం మీదుగా తంబళ్లపల్లెకు వెళ్లకుండా వేపూరికోట, గుండ్లపల్లి మీదుగా తంబళ్లపల్లెకు వెళ్తున్నారు. ● సోంపాళ్యం నుంచి గూడుపల్లి వెళ్లే రోడ్డుపై గుంతలు ఉండడంతో వాహనదారులు, ఆటోలలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గూడుపల్లి మార్గంలో ఉన్న కట్టపై కూడా గుంతలు ఉండడంతో వర్షం పడిన సమయంలో ఈ కట్టపై ప్రయాణం ఇబ్బందిగా ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు. గూడుపల్లి నుంచి కాలువపల్లికి వెళ్లే రోడ్డు దారుణంగా ఉంది. ● కురబలకోట, పెద్దమండ్యం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె మండలాల్లోని పలు గ్రామీణ దారులు దారుణమైన స్థితిలో ఉన్నాయి. గ్రామాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పాలకులు పట్టించుకున్న పాపన పోలేదని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు.



తంబళ్లపల్లె మండలంలో అధ్వానంగా ఉన్న రహదారి



కర్ణాటక సరిహద్దు వరకు రహదారి దుస్థితి

ప్రతిపాదనలు పంపించాం

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అన్ని రోడ్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంతలు లేకుండా మరమ్మతు చేసి బాగుపడేలా చూస్తాం. ఈ పనులు జనవరి 15లోపు పూర్తి చేస్తాం. కందుకూరు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు ఉన్న రోడ్డు పనులకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే డబుల్ రోడ్డు పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. బడికాయలపల్లి నుంచి సరిహద్దు వరకు రోడ్డు పనులు కూడా ప్రతిపాదనలు పంపించాం. **- అరవిందదేవి, ఈఈ, ఆర్‌అండ్‌బీ, మదనపల్లె**

రెవెన్యూ సేవల్లో పారదర్శకత ముఖ్యం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, పక్కన జేసీ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ నైదియాదేవి

రాజంపేట, న్యూస్‌టుడే: ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవల్లో పారదర్శకత ఎంతో ముఖ్యమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. స్థానిక కళాంజలి కల్యాణ మండపంలో బుధవారం రాజంపేట రెవెన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల విన్నపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సేవల్లో నాణ్యతతో పాటు పారదర్శకత ఉండాలని సూచించారు. సీఎం కార్యాలయం నుంచి ఎన్ని ఫిర్యాదులు అందాయి వాటిల్లో ఎన్ని పరిష్కరించారు, సీసీఎల్ఏ, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులెన్ని వచ్చాయి, హైకోర్టు, జాతీయ మానవ హక్కులు, లోకాయుక్త కమిషన్ ద్వారా వచ్చిన కేసులెన్ని..? భూసేకరణ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ తీర్మానాల వంటి విషయాలపై సమగ్రంగా చర్చించారు. జేసీ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ నైదియాదేవి, జిల్లా సర్వే అధికారి భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు



కేకును కోస్తున్న వెంకటేశ్వరరాజు, రవికుమార్‌రాజు, అభిమానులు

రైల్వేకోడూరు, పుల్లంపేట, న్యూస్‌టుడే: ప్రముఖ కథానాయకుడు ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు, సర్పంచి రవికుమార్‌రాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అభిమానులతో కలిసి కేకును కోసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచి పుష్పలత, సునీత, సుబ్రహ్మణ్యంరాజు, మునిరాజు, జయప్రకాష్ నారాయణవర్మ, రామరాజు పాల్గొన్నారు. పుల్లంపేట అప్పయ్యరాజుపేట రామక్కపల్లె ఎస్సీ కాలనీవాసులు వేడుకలు నిర్వహించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని డి.అబ్బవరం కమ్మపల్లి, నక్కవాండ్లపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించామని నియోజకవర్గ తెదేపా నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. తాగునీటి బోరును బుధవారం ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా నిర్వహించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గోడ పత్రికలు ఆవిష్కరించారు. పశుగణన చేపట్టేందుకు పశు సంవర్ధక శాఖ సహాయకులు, ఇతరులను కలిపి 292 మందిని నియమించామన్నారు. పశువుల గణాంకాలు సేకరించేందుకు పశు వైద్య సిబ్బంది రైతుల ఇంటి వద్దకు వచ్చినప్పుడు రైతులు వారికి సహకరించి వారి వద్దనున్న ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తదితర వివరాలు అందించాలన్నారు. పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టరు గుణశేఖర్‌పిళ్లై, సీపీవో వెంకట్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్ పరిశీలన

నందలూరు, న్యూస్‌టుడే: నందలూరు మండల పరిధిలోని టంగుటూరు ఇసుక రీచ్‌ను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టరు ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఇసుకను వినియోగదారులకు అందించాలని సంబంధిత గుత్తేదారుకు ఆయన సూచించారు.

చెత్త సేకరణ సరే... వసతుల మాటేంటి?

ఎస్‌డబ్ల్యూపీసీలపై గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం

సదుపాయాల కల్పనపై ఎన్డీయే సర్కారు కసరత్తు



సుండుపల్లి మండలం జి.రెడ్డివారిపల్లెలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం

రాజంపేట పట్టణం, గ్రామీణ, సుండుపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛస్ఫూర్తితో ప్రతి గడప నుంచి చెత్తను సేకరించాలి. పల్లెసీమల్లో పరిశుభ్రత వాతావరణం కల్పించాలని సదాశయంతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీలు- సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్) నిర్మించారు. ఈలోగా ఎన్నికలు రావడంతో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. క్షేత్రస్థాయిలో మౌలిక వసతులను విస్మరించింది. నాటి సీఎం జగన్ సర్కారు నిర్వహణను గాలికొదిలేసింది. ఎన్డీయే కూటమి పాలకులు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అన్నిచోట్ల ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఉన్నతస్థాయి నుంచి ఉత్తర్వులందాయి. ఎక్కడెక్కడ ఎలాంటి వసతులున్నాయి, ఇంకా ఎలాంటి సదుపాయాలు అవసరమని సమాచారం సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

★ జిల్లాలో 501 గ్రామపంచాయతీలున్నాయి. పల్లెసీమల్లో 4,66,171 కుటుంబాలుండగా, 16.97 లక్షల మందికిపైగా జనాభా ఉన్నారు. ప్రతి గడప నుంచి తడి, పొడి వ్యర్థాలను సేకరించి సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేయాలని నిర్ణయించి అయిదేళ్ల కిందట అప్పటి తెదేపా పాలనలో 439 చోట్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఇందుకోసం నరేగా పద్దు రూ.15 కోట్లకుపైగా వెచ్చించారు. వీటిలో ప్రస్తుతం పూర్తిస్థాయిలో 320, పాక్షికంగా 96 పనిచేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చాలాచోట్ల వినియోగంలో లేవు. మరోవైపు 26 కేంద్రాలు నిరుపయోగంగా ఉండగా, 62 చోట్ల నిర్మాణంలో ఉన్నాయి.

★ నెలకు రూ.6 వేల వేతనంతో క్లాప్‌మిత్రలు 1,187 మంది, కాపలాదారులు 439 మంది పనిచేస్తున్నారు. వైకాపా అధికారంలోకి వచ్చిన అనంతరం సిబ్బందికి ఆరేడు నెలలకొకసారి కూడా జీతాలివ్వలేని పరిస్థితి నెలకొంది. మూడు చక్రాల రిక్షాలు 1,290, ఎలక్ట్రికల్ ఆటోలు 47 ఇవ్వగా, చాలాచోట్ల రహదారుల్లేవు. సగానికి పైగా విద్యుత్తు సరఫరా కల్పించలేదు. గుక్కెడు నీరివ్వలేదు. కనీసం సూచికలు ఏర్పాటు చేయలేదు. చెత్త నిల్వ చేయడానికి అనువైన తొట్టెలను నిర్మించలేదు. కొన్నిచోట్ల చేపట్టినా దెబ్బతిన్నాయి. వానపాముల ఎరువు ఉత్పత్తి చేయలేదు. పంచాయతీలకు ఆశించిన స్థాయిలో కాదు కదా కనీసం మోస్తరుగా ఆదాయం సమకూరడం లేదు.

★ రాజంపేట మండలం మందపల్లి, మందరం, కొల్లావారిపల్లె, మిట్టమీదపల్లి, సుండుపల్లి మండలం భాగంపల్లి, ఈడిగపల్లి, జి.రెడ్డివారిపల్లె, సొంతంవారిపల్లి, మాచిరెడ్డిగారిపల్లెలోని కేంద్రాల్లో కనీస మౌలిక వసతుల జాడ లేదు. ఇక్కడే కాకుండా చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. గత అయిదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులివ్వాలని పంచాయతీ అధికారులు ప్రతిపాదనలు పంపినా అప్పటి సీఎం జగన్ ఏలుబడిలో మోక్షం లభించలేదు. అధికార యంత్రాంగం కూడా చేసేదేమిలేక వదిలేసింది.

★ ఎన్డీయే కూటమి పాలకులు అన్ని చోట్ల కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులు సన్నద్ధమవుతున్నారు. క్లాప్‌మిత్రలు, కాపలాదారులకు గత నెల వరకు రూ.17.39 కోట్లు వేతనాలు చెల్లించాల్సి ఉండగా, రూ.13.26 కోట్లు ఇచ్చామని చెబుతున్నా వీరిలో చాలామందికి అందలేదు. ఆదాయ వనరుల్లేని చిన్న పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తున్నారు. అటు అభివృద్ధి పనులకు, ఇటు పారిశుద్ధ్యం, విద్యుత్తు బిల్లుల బకాయిలు చెల్లించడానికి, పంచాయతీల నిర్వహణకు సర్దుబాటు చేయడం కష్టంగా ఉంటుంది. ఈ కారణంగా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. ఇంకా రూ.4.13 కోట్లు ఇవ్వాలి. వీటిని కూడా త్వరగా చెల్లించాలని జిల్లా అధికారులు పంచాయతీ యంత్రాంగాన్ని తాజాగా ఆదేశించారు.

సమాచారం సేకరిస్తున్నాం

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అన్నిచోట్ల వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి ఎక్కడెక్కడ ఏం అవసరాలు కావాలో సమాచారం సేకరిస్తున్నాం. రహదారులు, తాగునీరు, విద్యుత్తు, కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తాం. సేంద్రియ ఎరువు తయారీ చేయించి రైతులకు విక్రయిస్తాం. పంచాయతీల ఆదాయాన్ని పెంచుతాం. క్లాప్‌మిత్రలు, కాపలాదారులకు వేతనాలు చెల్లిస్తాం.

- బాలకృష్ణారెడ్డి, డీపీవో, అన్నమయ్య జిల్లా

వైద్యశిబిరానికి స్పందన

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లి ఆరెమ్మ దేవాలయం వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షల అనంతరం 19 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశామని నిర్వాహకులు వై.ఆరంరెడ్డి తెలిపారు. శిబిరానికి 200 మంది హాజరయ్యారని వారు వివరించారు. తిరుపతిలోని వెంకటేశ్వర అరవిందో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం కూలీల అరెస్టు

సుండుపల్లి: ముడుంపాడు అటవీ పరిధిలో మంగళవారం జరిగిన దాడుల్లో తొమ్మిది ఎర్రచందనం దుంగలతో పాటు తమిళనాడుకు చెందిన ఇద్దరు కూలీలను అరెస్టు చేశామని సానిపాయి రేంజి అధికారి వైసీరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో పారిపోయిన వారి కోసం గాలిస్తుండగా అన్నమయ్య జిల్లా రాయవరం పరిధిలోని మోరుదరి ప్రాంతంలో మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన బి.చిన్నానాయక్, వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన మల్లికార్జున, నెల్లూరుకు చెందిన రామాంజనేయులు ఉన్నారన్నారు. పట్టుబడిన వారిని బుధవారం కోర్టులో హాజరు పరిచామన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రం హత్యరాల శ్రీత్రేతేశ్వరస్వామి ఆలయ పరిధిలో ప్రతి నెలా పౌర్ణమి రోజున స్వామి వారి ఉత్సవ విగ్రహాలను భద్రపరిచేందుకు భవనం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. ఆలయం సమీపంలో గిరిప్రదక్షిణ మండలి సభ్యులు భూమి పూజ చేశారు. మండలి కమిటీ అధ్యక్షుడు సిద్ద లింగారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఆలయ గిరి ప్రదక్షిణ మండలి సభ్యులు

ఎస్సీ బాలుర వసతి గృహం తనిఖీ



వసతి గృహ సంక్షేమాధికారితో మాట్లాడుతున్న జిల్లా అయిదో అదనపు జిల్లా న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని జిల్లా అయిదో అదనపు కోర్టు న్యాయమూర్తి ఎస్.కృష్ణన్‌కుట్టి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, విద్యార్థులు నిద్రించే గదులు, మరుగుదొడ్లు, వసతి గృహ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, హాజరుపై ఆరా తీశారు. వసతి గృహంలో సమస్యల గురించి విద్యార్థులను, వసతి గృహ సంక్షేమాధికారి నూరుల్లాబాషాను అడిగి తెలుసుకున్నారు. కోర్టు సిబ్బంది, హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు, దామోదర్‌లు పాల్గొన్నారు.

న్యాక్‌లో ఉద్యోగ మేళా రేపు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట న్యాక్ కేంద్రంలో ఈ నెల 25న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి కార్యాలయం, డీఆర్‌డీఏ సిడప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల్లోపు ఉండి, పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఫొటోలు తీసుకుని నేరుగా హాజరుకావాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు డిమాండు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: చెన్నముక్కపల్లె పంచాయతీ రాజుల కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం రాజుల కాలనీ వాసులతో కలిసి సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో రంగస్వామికి వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు ఓబులేసు, అబ్దుల్ రజాక్, సైమా, రాజుల కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సులకు అపరాధ రుసుం విధింపు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట నుంచి ఇతర పట్టణాలకు ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు బస్సులకు రాజంపేట ఎంవీఐ అధికారులు బుధవారం భారీ ఎత్తున అపరాధ రుసుంలు విధించారు. ఈ సందర్భంగా రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేటు బస్సులకు ఉండాల్సిన పత్రాలు లేకుండా వాహనాలు నడపడంతో రూ.77.30 లక్షలు అపరాధ రుసుం విధించామన్నారు. ఆయన వెంట ఆర్టీసీ ఇబ్బంది ఉన్నారు.

బాలికల సంరక్షణ బాధ్యత అందరిది



విద్యార్థినుల తల్లిదండ్రులకు సూచనలిస్తున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

వీరబల్లి, న్యూస్‌టుడే: బాలికలపై జరుగుతున్న రోజురోజుకు జరుగుతున్న అరాచకాలను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సీఐ రవిశంకర్ అన్నారు. ఎర్రంరాజుగారిపల్లి ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణపై గుడ్ నైబర్స్ ఏపీ కోర్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాలికల సంరక్షణ, బాల్యవివాహాలు, బాలికల సంరక్షణ చట్టం గురించి వివరించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు తక్షణం తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని విద్యార్థినులకు సూచించారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ప్రభావతి, హెచ్‌ఎం మనోహర్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ నాగేశ్వర, కోఆర్డినేటర్ బాబు, అధికారులు రవి, రామలక్ష్మి, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘర్షణ ఘటనలో పది మందిపై కేసు నమోదు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం బోయనపల్లిలోని కళాశాల వద్ద ఇంజినీరింగ్ విద్యార్థులు మంగళవారం ఘర్షణ పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పది మంది విద్యార్థులపై కేసు నమోదు చేశామని మన్నూరు సీఐ రామాంజనేయులు బుధవారం తెలిపారు. స్థానికంగా చదువుకుంటున్న విద్యార్థుల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసిందని ఆయన వివరించారు.

సత్తా చాటిన విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న కరస్పాండెంట్ సుకుమార్‌రెడ్డి, హెచ్‌ఎం బాలాకుమార్

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని డాల్ఫిన్‌డేల్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ, నష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. 8, 9, 10వ తరగతుల నుంచి 64 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో తొమ్మిదో తరగతికి చెందిన వి.తాప్సీరెడ్డి, డి.సమీరారెడ్డి, ఎస్.గౌసియాబాను విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ పంజం సుకుమార్‌రెడ్డి వారికి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు బాలాకుమార్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బహుమతులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని గౌరీశంకర్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ, నష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. 8, 9, 10వ తరగతుల నుంచి 81 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఎనిమిదో తరగతి నుంచి ఎన్.చందన, తొమ్మిదో తరగతి నుంచి ఎ.నందిని, పదో తరగతికి చెందిన వి.భువనేశ్వరి అనే విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ అదనుకోట గోపీనాథ్ వారికి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ గోపీనాథ్, హెచ్‌ఎం మాధవి

ప్రశంసా పత్రాల అందజేత



ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలోని వీఆర్ హైస్కూల్‌లో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో కలిగే లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను ఆవిష్కరించారు. విజేతలుగా నిలిచిన ఎస్.రీమా, రెడ్డి వర్షిత, మధురిమలకు ప్రధానోపాధ్యాయులు శివారెడ్డి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాను, లక్ష్మీ ప్రసన్న, మంజులాదేవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక



నందలూరు : రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నందలూరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కడపలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో నందలూరు మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ నాగేశ్వరి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. అండర్-19 విభాగంలో జరిగిన 200, 1500, 4000 మీటర్ల పరుగు పందెం పోటీలలో వర్షిత, హేమలత, ఆశ, డిస్క్‌త్రో, షాట్‌పుట్‌లో నిత్య, జావలిన్‌త్రోలో యోగిప్రభ, ఖోఖోలో సాయిహారిక, నిత్య, వర్షిత, ఆశా, వనిత క్రికెట్‌లో హేమలత, చదరంగంలో పవిత్ర, తనూజ, హ్యాండ్‌బాల్, త్రోబాల్, టెన్నికాయిట్‌లలో ప్రతిమ, గ్రీష్మ, మాధురి, తేజ సత్తా చాటారన్నారు. అండర్-17 క్రికెట్, కబడ్డీ, క్యారమ్స్ విభాగాలలో అమృత, రేఖ, భవ్య, భవ్యశ్రీ, అండర్-14 కబడ్డీ, క్యారమ్స్ విభాగాలల్లో సంజన, దివ్యశ్రీలతో పాటు విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు సునీత రాష్ట్ర స్థాయి కోచ్‌గా ఎంపికయ్యారని ఆమె తెలిపారు.



లక్కిరెడ్డిపల్లె: మండల పరిధిలోని దప్పేపల్లె పంచాయతీ జాండ్రపల్లె ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి **రాజేంద్ర** రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. స్థానిక పాఠశాలలో బుధవారం ఆయన మాట్లాడారు. కడప మున్సిపల్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన అండర్-17 విభాగంలో రాజేంద్ర ప్రతిభ కనబరిచాడన్నారు.



పుల్లంపేట: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని **జాస్మిన్** ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, పీడీ నీలకంఠేశ్వరరావు తెలిపారు. కడపలో ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా హాకీ జట్టుకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

వెలిగల్లులో పెరుగుతున్న నీటి మట్టం

గాలివీడు, న్యూస్‌టుడే: వెలిగల్లు జలాశయంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతంలో పడిన వర్షాలకు పాపఘ్ని నది ప్రవహించి 625 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుతోంది. జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా బుధవారం 2.60 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఎడమ కాలువకు రెండు క్యూసెక్కులు, గాలివీడు, రాయచోటి రక్షిత నీటి పథకాలకు ఆరు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నీటి నిల్వను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఏఈ సాంబశివుడు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురంగొల్లపల్లెకు చెందిన ఆదిమూలం శ్రీనివాసులుకు వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో లక్కిరెడ్డిపల్లె వెళ్తుండగా ఎక్సైజ్ కార్యాలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యక్తి ముజీద్‌బాషా ఆయన్ను లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లీకుమారుల అదృశ్యం

గాలివీడు: గోరాన్‌చెరువు పంచాయతీకి చెందిన వివాహిత(30) తన నాలుగేళ్ల కుమారుడిని తీసుకుని ఇంటి నుంచి రెండు రోజుల కిందట వెళ్లి కనిపించకుండా పోయిందని ఏఎస్ఐ రమణ పేర్కొన్నారు. ఆమె భర్త మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

మహిళపై దాడి చేసిన వారిపై కేసు

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ ఆవులరెడ్డిగారిపల్లెకు చెందిన దేరింగుల ప్రమీలకు అదే గ్రామానికి చెందిన ఆమె మామ చిన్నప్పకు ఆస్తి విషయమై వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో చిన్నప్ప వారి బంధువులతో కలిసి ఆమెపై ఇటీవల దాడి చేసి అవమానించారని బాధితురాలు బుధవారం ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు.

నిర్మాణంలో ఉన్న ఆలయం ధ్వంసం



ధ్వంసమైన ఆలయం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి మండలం గొర్లముదివీడు పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లెలో బుధవారం నిర్మాణంలో ఉన్న ఇరుగులమ్మ ఆలయాన్ని కొందరు కూల్చి వేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో కొంతకాలంగా అమ్మవారి ఆలయాన్ని నిర్మించుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ మహిళ బుధవారం ఆలయాన్ని తమ స్థలంలో నిర్మిస్తున్నారంటూ వారి కుటుంబ సభ్యులతో కలిసి జేసీబీతో కూల్చి వేయించారని ఆరోపించారు. ఈ విషయాన్ని కలెక్టరు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

మద్యం దుకాణం తొలగించాలని నిరసన


సీపీఐ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని చింతలనగర్ మైదానంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలంటూ స్థానికులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. జిల్లా సీపీఐ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వారు ఈ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల, ప్రైవేటు డిగ్రీ, జూనియర్ కళాశాలలు, నివాసాల మధ్యలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. దీంతో విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండు చేశారు.

పాఠశాలకు సమకూరిన గ్రిల్స్

రాయచోటి: సిద్దారెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన కొందరు దాతలు బుధవారం గ్రిల్స్ ఏర్పాటు చేయించారు. రూ.20 వేల విరాళంతో దాతలు ఏర్పాటు చేయించారని ఉపాధ్యాయుడు మస్తాన్‌వలి, విద్యాకమిటీ ఛైర్మన్ ఈశ్వరయ్య, ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీఐఐసీ భూములను స్వాధీనం చేసుకోవాలని వినతి

రాజంపేట, న్యూస్‌టుడే: ఏపీఐఐసీ భూములను ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని... ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండు చేస్తూ బుధవారం రాజంపేటకు వచ్చిన కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు టీఎన్‌ఎస్‌ఎఫ్, నిరుద్యోగ జేఏసీ, పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్దిక్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నూతన పారిశ్రామిక వేత్తను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో రాజంపేట మండలం బోయనపల్లి, మన్నూరు, తాళ్లపాక రెవెన్యూ పరిధిలో అన్యాక్రాంతమైన ఏపీఐఐసీ భూములను స్వాధీనం చేసుకుని కొత్తవారికి కేటాయించాలని కోరారు. తాళ్లపాక చెరువు ప్రాంతాన్ని సమీపంలోని ఓ కళాశాల యాజమాన్యం ఆక్రమించేసిందని.. సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. నాయకులు పాండురాజు, కేశవ పాల్గొన్నారు.

రాణా ప్రాంతం... సమస్యలతో సతమతం

❖ పట్టించుకోని అధికార యంత్రాంగం ❖ ఇదీ రాయచోటి పురపాలికలో దుస్థితి


రాణా ప్రాంతంలో నిలిచిన కాలువ నిర్మాణ పనులు


అస్తవ్యస్తంగా ట్రాఫిక్

– న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

రాయచోటి పురపాలికలో ఏళ్ల తరబడి అభివృద్ధి జరగట్లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారినా... అభివృద్ధికి నోచుకోవట్లేదు. గత వైకాపా ప్రభుత్వంలో ఈ ప్రాంత నాయకులు పట్టణ అభివృద్ధిని గాలికొదిలేశారు. కనీస వసతులు కల్పించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పురపాలక సంఘం పరిధిలో 34 వార్డులు, సుమారు 31 వేల నివాసాలున్నాయి. లక్షా ఇరవై వేల వరకు జనాభా ఉన్నారు. ఏ వార్డులో చూసినా సమస్యలే పలకరిస్తాయి.

◆ 8వ వార్డు పరిధిలోకి వచ్చే రాణా ప్రాంతంలో దాదాపు 2500 మంది ప్రజలు నివశిస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం ముస్లిం మైనార్టీలే ఉన్నారు. ఇక్కడ ఎటు చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. సక్రమంగా ప్రభుత్వ పథకాలు అందడం లేదని స్థానికులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఇక్కడ ఎటు చూసినా అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. కాలువలు పొంగి పొర్లుతూ... రోడ్లపై మురుగు పారుతోంది. ప్రధానంగా ఈ ప్రాంతంలోని నాలుగు రోడ్ల కూడలిలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సిగ్నల్ లైట్లు సరిగా పని చేయట్లేదని వాహన చోదకులు వాపోతున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు.

ప్రధాన సమస్యలివీ...

◆ గత వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన రహదారుల విస్తరణ పనుల్లో నాణ్యత లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. రహదారుల విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం చేపట్టినా పూర్తి కాలేదు. ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరు మొత్తం ఈ ప్రాంతంలోని నివాసాల్లోకి వెళ్తోంది. త్వరితగతిన కాలువలు నిర్మాణాలను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

◆ రాణా ప్రాంతంలో మాంసపు విక్రయ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రధాన రహదారి పక్కనే అవి ఉండటంతో దుమ్ము ధూళి మొత్తం మాంసంపై పడుతూ కలుషితమవుతోంది. దీంతో కొనుగోలుదారులు అనారోగ్యం పాలవుతున్నారు. అన్ని వసతులతో మీట్ మార్కెట్ ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.


◆ వీధి కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. రెండు నెలల కిందట ఈ ప్రాంతంలో ఓ పిచ్చికుక్క దాడి చేయడంతో దాదాపు 15 మందికిపైగా గాయపడ్డారు.

మౌలిక వసతులు కల్పించాలి



రాణా ప్రాంతంలో ఎక్కువగా ముస్లిం మైనార్టీలే నివాసం ఉంటున్నారు. స్థానికంగా అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో వేరే బజార్‌లోని కేంద్రానికి పంపాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వమైనా వసతుల కల్పనకు కృషి చేయాలి. గత ప్రభుత్వంలో అర్హులకు ప్రభుత్వ పథకాలు అంతలేదు. కూటమి ప్రభుత్వమైనా అందేలా చూడాలి. **- షేక్ నూరుల్లా బాషా**

కాలువలు నిర్మించాలి



రహదారుల విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన కాలువల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి. పారిశుద్ధ్యం మెరుగునకు అధికారులు చొరవ చూపాలి. అన్ని వసతులతో మీట్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి. వీధి కుక్కల బెడద లేకుండా పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాలి.
- పయాజుద్దీన్, రాణా

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

రాయచోటి, న్యూస్‌టుడే: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించి సమాజ సేవకు తోడ్పడాలని మానవత సంస్థ రాయచోటి శాఖ అధ్యక్షుడు గాండ్లపెంట ఖాదర్‌బాషా పేర్కొన్నారు. మాసాపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవరుచుకోవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరన్నారు. క్రమశిక్షణ అలవరుచుకుని విద్యను అభ్యసించడం వల్ల భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, ఛైర్మన్ శివగంగిరెడ్డి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక ఆచూకీ రెండు గంటల్లోనే లభ్యం



బాలికను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పట్టణ సీఐ చంద్రశేఖర్

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో బాలిక అదృశ్యం కలకలం రేపింది. చిత్తూరు జిల్లా అరకొండకు చెందిన 12 ఏళ్ల బాలిక తల్లితో కలిసి రాయచోటిలోని బంధువుల ఇంటికి వచ్చింది. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే బాలిక కోసం పోలీసులు అన్ని ప్రధాన కూడళ్లు, సీసీ కెమెరాల ఆధారంగా గాలించారు. మధ్యాహ్నం రెండు గంటలకు కొత్తపేట సెంటర్‌లో ఆచూకీ లభ్యమైంది. దీంతో బాలికను స్టేషన్‌కు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించామని పట్టణ సీఐ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

రాయచోటి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్ని విభాగాలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అమరావతి జేఏసీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మీ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో డీఆర్వో సత్యనారాయణరావుకు బుధవారం వినతి పత్రం అందించారు. అనంతరం స్థానిక ఎన్జీవో హోంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కలెక్టరేట్లలో సీ బాక్సులు ఏర్పాటు చేయించాలని అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ శివకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం మదనపల్లె డివిజన్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం కో-ఛైర్‌పర్సన్లు, సెక్రటరీలు జిల్లా మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.


డీఆర్వో సత్యనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న మహిళ ఉద్యోగులు

విద్యార్థినులు క్రీడల్లో రాణించాలి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్.ఐ.నవీన్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వై.లాస్య అండర్-17 విభాగం తైక్వాండో పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పి.పవన్, బి.రూపశ్రీ, ఎస్.మదీహాలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ వెంకటసుధీర్ వివరించారు. వీరంతా ఈ నెల 6, 7, 8వ తేదీలలో తిరుపతిలో జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పాల్గొని అర్హత సాధించారన్నారు. విద్యార్థినులను ఎస్.ఐ., ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినులతో ఎస్.ఐ. నవీన్‌బాబు, ఉపాధ్యాయులు

STATE BANK OF INDIA
KODUR MAIN BRANCH - KODUR
LOCKERS BREAK OPEN NOTICE

It is hereby to the below mentioned borrowers who availed lockers facility from our bank. Bank has decided to break open the lockers as the persons failed to pay their locker rent for a long time. Hence notice is given to the locker holders mentioned below & are requested to pay the Locker Rent in full and regularise their locker account or hand over the locker / keys on or before **07.11.2024.** Otherwise lockers will be break opened.

Sl. No.	Cabinet No.	Locker No.	Locker Holder's Name	O/s Amount (In Rs.)
1	1	8	Khasim Shaik, Flat No. 17, Block 8, No.2 Road, Bayan, Kuwait.	6,000.00
2	1	39	M.Annapoornamma & Marella Nagaraju W/o Marella Nagaraju, 9/280, Sriram Nagar, Rly. Kodur	13,500.00
3	1	56	C.Chaitanya Raju, S/o C.Venkata Subbaiah, Shares Agent, New Krishna Nagar, Rly. Kodur	12,000.00
4	2	6	Nakka Subbaramaiah & N.Rajeswari, Kodur.	16,500.00
5	2	15	Shaik Jan Bee, W/o Khader Basha, Gandhi Nagar, Chitvel Road, Rly. Kodur.	16,500.00
6	2	17	Shaik Mohammad Rafi, S/o Peerasab, Kodur.	18,000.00
7	2	59	Ghouse Saheb Shaik, Kodur.	16,500.00
8	2	78	Ram Swaroop, Opp. Rly Station, Kodur.	16,500.00
9	2	88	P.Venkata Ramana, PB 173, Safat 13002, Kuwait.	16,500.00
10	3	55	Duddula Subbanarasimhulu & D.Malika, Duddula Subbanarasimhulu, 7/75, Suryanagar, Rly. Kodur	4,500.00
11	3	65	C.M.Ramanatha Reddy, R.S.Road, Rly. Kodur - 516101.	4,500.00
12	4	34	M.V.Raghurami Reddy, Deevarayapalli Nagavaram.	12,000.00

Date : 23.10.2024 Sd/- **Chief Manager**, State Bank Of India
Place : Kodur Kodur Main Branch, Kodur.